క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవాలు



గురజాల : పట్టణంలోని అంకమ్మతల్లి దేవాలయం కలశం, గాలిగోపురం ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అంకమ్మ తల్లిని దర్శించుకునేందుకు బారులు తీరారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. అంకమ్మతల్లిని నాగార్జున సాగర్ కాలువ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతారావు, ఎన్.బల్లయ్య, అడపా శ్రీనివాసరావు, కె.అంకారావు, నవులూరి పుల్లయ్య, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో తేరుప్రదక్షిణ



విజయపురిసౌత్: స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవ రూపాన్ని ధరించి, సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి విధానాలను వెలుగులోకి తెచ్చారన్నారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తల నీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

రైతు వివరాలు నమోదు చేసుకోవాలి

గురజాల రూరల్: రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ వివరాలను ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు అర్హులవుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విధిగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జెరాక్స్‌తో పాటు బ్యాంకు ఖాతాకు లింకు అయి ఉన్న సెల్ ఫోన్ నంబరు తీసుకుని వెళ్లాలని పేర్కొన్నారు.

తురకపాలెంలో చోరీ



మాచవరం: ఇంట్లో ఎవరూలేని సమయంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన మండలంలోని తురకపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ దరియావతి సొంత పనులు నిమిత్తం పిడుగురాళ్ల వెళ్లాడు. కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.90 వేలు నగదు, సుమారు 5 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, క్లూస్ టీం వచ్చి వేలి ముద్రల ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మరొకరికి గాయాలు

నకరికల్లు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండలంలోని దేచవరం మిద్దె సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన వేల్పూరి నాగేశ్వరరావు, కసుకుర్తి సుమంత్(16)లు ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేదారు. మార్గంమధ్యలో దేచవరం మిద్దె వద్దకు చేరుకొనే సరికి గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. ఘటనలో బైక్ నడుపుతున్న వేల్పూరి నాగేశ్వరరావు, సుమంత్‌లకు తీవ్ర గాయాలు కాగా కసుకుర్తి సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

దప్పిక పంచాయితీ

- ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో తాగు నీటి సమస్య
- అరకొరగా తాగు నీరు సరఫరా చేస్తున్న పంచాయతీ
- పైపు లైన్ల లీకేజీతో మురుగు నీరూ సరఫరా
- విన్నవించినా మరమ్మతులు చేపట్టడం లేదని మహిళల ఆందోళన
- కలుషిత నీటితో రోగాలు తప్పవంటూ ఆవేదన



రెంటచింతల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆంజనేయస్వామి మాణ్యం కాలనీవాసుల ఆందోళన

రెంటచింతల: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి మాణ్యం కాలనీలో దప్పిక డప్పులు మోగుతున్నాయి. మంచినీటి సమస్యను పరిష్కారించాలని స్థానికులు గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయినా.. వారిని పట్టించుకునునే అధికారి కరువయ్యారు. ప్రతి రోజు కాలనీలో పైప్‌లైన్‌కు 15 నిమిషాల కూడా మంచి నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలనీ సమీపంలో పైప్‌లైన్‌కు లీకేజ్ ఏర్పడటంతో ముందు కొంత సమయం కలుషితమైన నీరు వస్తుందని, ఈ విషయం అధికారులకు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ కాలనీలో సరైనా నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీరు వల్ల డయేరియా వంటి పలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. కాలనీ సమీపంలో 10 రోజులకు పైగా పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడినా.. సంబంధిత అధికారులు చోద్యం చుస్తున్నారే తప్పా కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ.. ప్రజలకు తాగునీరు సరఫరా చేయాల్సిన చట్టబద్ధమైన విధి. పైప్‌లైన్ ద్వారా నాణ్యమైన తాగు నీటిని అందించాల్సిన పంచాయతీ ఇలా నిర్లక్ష్యం ధోరణి అవలంబించడం తగదంటున్నారు. ఒక వ్యక్తికి రోజుకు కనీసం 55 లీటర్లు చొప్పున తాగునీరు ఖచ్చితంగా గ్రామ పంచాయతీ వారు సరఫరా చేయాలి. వివిధ పనులకు వెళ్లే తాము ప్రతి రోజు మంచినీటి కోసం అల్లాడిపోతున్నట్లు కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో ఏర్పడిన మంచి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పైపు లైన్‌కు లీకేజీ

తాగునీటికి ప్రతి రోజు తిప్పలే



మా కాలనీలో తాగు నీటి కోసం ప్రతి రోజు అనేక తిప్పలు పడుతున్నాం. కొంతసేపు మాత్రమే మంచి నీరు ఇవ్వడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోలేదు. కాలనీ ప్రజలు నీటి బిందెలతో గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టుముట్టిన ప్రయోజనం లేదు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల మేము పడుతున్న బాధలు ఏవరికి చేప్పుకోవాలో తెలియడం లేదు.

– బి.తిరుపతయ్య, కాలనీవాసి

లీకేజీని పట్టించుకోవడం లేదు



మా కాలనీ సమీపంలో మెయిన్ మంచినీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజ్ విషయం స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదు. నీరు సరఫరా సమయంలో ముందు కొంతసేపు మురుగు వస్తుంది. దీంతో ప్రజలు అనేక వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఎంతో కాలంగా ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన సంబధిత అధికారులు మా కాలనీలో ఏర్పడిన మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

– ఓరుగంటి సునీల్‌రెడ్డి, కాలనీ వాసి

బీమాతో కుటుంబం సురక్షితం

పిడుగురాళ్ల: బీమాతో ప్రతి కుటుంబం సురక్షతంగా ఉంటుందని ఎస్‌బీఐ పిడుగురాళ్ల మెయిన్ బ్రాంచ్ మేనేజర్ వినీత్‌కుమార్, బజార్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్ దూబే తెలిపారు. పిడుగురాళ్ల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, బజార్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లిలోని ఎస్‌హెచ్‌జీ సభ్యుల శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మేనేజర్లు మాట్లాడుతూ... బీమా ప్రతి కుటుంబానికి ఆసరాగా ఉంటుందని తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వెంకటేష్ నాయక్‌కు రూ.2 లక్షల బీమా నగదును అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ధనుంజయ్, ఆర్‌హెచ్ మురళీ మోహన్, చందన, సచిన్, బ్రాహ్మణపల్లి, కామేపల్లి గ్రామాల సీసీ కె.రవి, వీవోఏలు, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



బీమా నగదు చెక్కును అందజేస్తున్న మేనేజర్లు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మాచర్ల రూరల్: మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నేతృత్వంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని తాళ్లపల్లి, భైరవునిపాడు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు. శివరాత్రి పండుగ ఎంతో విశిష్టమైనదని, శివలింగం పై ఉన్న విబూది రేఖలు జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అని వివరించారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని, అందుకే మధ్యలో ఉండే విబూది రేఖకు ఎర్రని బొట్టు పెడతారని, మూడు ఆత్మల వివరణలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి వీరాంజనేయులు, కటకం సైదారావు, అనురాధ, వెంకట లక్ష్మి, రాఘవ, వీరయ్య, గంగయ్య, కోటేశ్వరమ్మ తదితరులున్నారు.

అంజుమన్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

కారెంపూడి: కారెంపూడి అంజుమన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తండా మస్తాన్ జాని, షేక్ అక్బర్ జానీబాషా, అధ్యక్షులుగా షేక్ బుడేసా (టెంట్ హౌస్), ఉపాధ్యక్షులుగా షేక్ మోదీన్‌సా, ట్రెజరర్‌గా షేక్ దావూద్, సెక్రటరీగా షేక్ ఖాసిమ్ సైదా, జాయింట్ సెక్రటరీగా షేక్ జానీని ఎన్నుకున్నారు. ఇదిలా ఉంటే మొదటి 18 నెలలు షేక్ బుడేసా (టెంట్ హౌస్), తర్వాత 18 నెలలు షేక్ మోదీన్‌సా అంజుమన్ కమిటీ అధ్యక్షులుగా కొనసాగే విధంగా ముస్లిమ్ పెద్దలు ఒప్పందం కుదిర్చారు. సభ్యులుగా మహబూబ్ బాషా, తండా అబ్బాస్, షేక్ జానీబాషా, సయ్యద్ సుభాని, కాపర్తి ఖాసిమ్‌వలీలను ఎన్నుకున్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న పెద్దలు

అలసత్వం

- సమాచారం హక్కు చట్టంపై అధికారుల నిర్లక్ష్యం
- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని బోర్డులు
- బోర్డులున్నా..పాత అప్పీలేట్ అధికారుల పేర్లే దర్శనం



గురజాలలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు



బోర్డు లేకుండా దర్శనమిస్తున్న కార్యాలయం

గురజాల: సమాచారం హక్కు చట్టం ఆచరణలో నిర్లక్ష్యానికి గురవుతోంది. దీని అమలులో గ్రామ స్థాయి నుంచే ప్రభుత్వ కార్యాలయాల్లో అలక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చట్టం అమలుకు ప్రత్యేక ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. సంబంధిత ఉద్యోగి సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులను పరిశీలించి, కోరిన సమాచారం ఇవ్వాలి. కానీ ఏక్కడా కూడా చట్టం అమలు కావడం లేదు. సమాచార హక్కు చట్టం అధికారుల పేర్లుతో బోర్డులు అయితే ఉన్నాయి కానీ, సమాధానమిచ్చే వారు కరువయ్యారు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడ కూడా సమాచార హక్కు చట్టం అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమాచార అధికారి ఎవరు?

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు దీనిపై చిన్న చూపు చూస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రాధ్యానతను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. పలు కార్యాలయాల్లో ఆ బోర్డులు మచ్చుకైనా కానరావడం లేదు. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బోర్డులపై అప్పిలేట్ అధికారి పేరు, వారి ఫోన్ నంబరు తెలియజేయాల్సి ఉంది. కానీ ఇప్పటికే బోర్డులపై పాత అధికారుల పేర్లు దర్శనమిస్తున్నాయి.

నియోజకవర్గంలో ఇలా

నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని 70కిపైగా ప్రభుత్వ కార్యాలయాల్లోఆ సమాచార హక్కు చట్టం గురించి సమాచారం ఇచ్చే వారు కరువయ్యారు. గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధిక శాతం బోర్డులు కనిపించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇక్కడ బోర్డులు మూలకు చేరాయి. కొన్ని కార్యాలయాల్లో అప్పిలేటు అధికారి పేరు లేకుండా దర్శనమిస్తున్నాయి. కొన్ని కార్యాలయాల్లో గతంలో ఉన్న అధికారులు వారి వివరాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమాచార హక్కు చట్టం నీరు గారకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన అవసరం



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచడం చాలా అవసరం. కేవలం అవినీతి అధికారుల కోసమే ఈ చట్టం కాదు. సామాన్యుడి చేతిలో అస్త్రం ఇది. ఈ చట్టంతో భారీ కుంభకోణాలను వెలుగు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ పథకాల్లో అవకతవకలు ఈ చట్టంతో వెలికి తీయవచ్చు.

– వై.రామకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్, మానవ హక్కుల కమిషన్

నేటి నుంచి ఒప్పిచర్లలో బ్రహ్మంగారి తిరునాళ్ల

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సోమ, మంగళ వారాల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ప్రారంభరోజు బ్రహ్మం గారి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేస్తారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణాన్ని దంపతులు పీటలపై కూర్చుని నిర్వహించనున్నారు. రెండవ రోజు ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలో మహాన్నదానం కార్యక్రమాలు జరగనున్నాయి. రాత్రికి బ్రహ్మం గారికి గ్రామస్తులు భారీగా విద్యుద్దీపాలతో ప్రభలు కట్టి గ్రామస్తులంతా మొక్కులు చెల్లించనున్నారు. గ్రామానికి తిరునాళ్ల శోభ వచ్చింది. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్న పిల్లలు, బంధువులు గ్రామానికి చేరుకుంటుండడంతో గ్రామంలో సందడి నెలకొంది. మఠాధిపతి ఎం.వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు తిరునాళ్ల ఏర్పాట్లు చేస్తున్నారు. బజారుకొక ప్రభ చొప్పున కట్టడానికి గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు.



వీరబ్రహ్మేంద్రస్వాముల వారి గుడి

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ రజతోత్సవాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వల్లెల గార్డెన్స్ నందు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రజతోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జోన్ ఇన్‌చార్జి బీకే సవిత, విజయవాడ జోనల్ ఇన్‌చార్జి శాంత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమంతో ప్రారంభించి మురళీ క్లాసు నిర్వహించారు. 10 గంటలకు యోగా, ధారణాయుక్త, యోగానుభూతి క్లాసు, బాబాకు భోగ్ నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు రజతోత్సవాలను ఏర్పాటు చేశారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల సేవా కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



రజతోత్సవంలో పాల్గొన్న సభ్యులు

5 కేజీల అండాశయ కణితి తొలగింపు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీ దత్త సాయి నర్సింగ్ హోమ్ నందు అండాశయ కణితిని ఆదివారం వైద్యులు తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ... పట్టణానికి చెందిన సీహెచ్ పార్వతీ 10 రోజుల నుంచి కడుపు నొప్పి అని బాధపడుతూ దత్తసాయి నర్సింగ్ హోమ్‌ను సంప్రదించారని తెలిపారు. కొన్ని పరీక్షలు నిర్వహించి ఆమెకు అండాశయంలో కణితి ఉందని గుర్తించటం జరిగిందన్నారు. డాక్టర్ లలిత రాణి, డాక్టర్ వెంకట్ సహాయంతో వెంటనే ఆపరేషన్ నిర్వహించి ఐదు కేజీలున్న కణితిని తొలగించడం జరిగిందని తెలిపారు.



డాక్టర్లు తొలగించిన అండాశయ కణితి

గ్రామీణ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

రెంటచింతల: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం ఎంతో పురోగతిని, అభివృద్ధిని సాధిస్తుందని ఈ విషయాన్ని నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులతో పాటు సీనియర్ నాయకులు గ్రామీణ ప్రజల్లోకి తీసుకువెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మాచర్ల నియోజకవర్గం నాయకులు పోకూరి కాశీపతి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల నూతన కార్యవర్గ సభ్యుల నియామక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలసి కేంద్ర ప్రభుత్వం దేశంలో, రాష్ట్రానికి అందజేస్తున్న నిధులు, పథకాలను ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. ముందుగా మండల ప్రధాన కార్యదర్శులుగా సంగం చెన్నకేశవులు, కత్తెరపల్లి బిక్షమాచారి, ఉపాధ్యక్షులుగా ఎం.సురేష్‌బాబు, కాశిబోయిన పిచ్చయ్య, తోడిచర్ల ఆనందబాబు, పోలిశెట్టి ప్రభావతి, అనంతవరపు గోవర్ధనాచారి, బొజ్జా ఏడుకొండలు, కోశాధికారిగా కొత్తా రాజేశ్వరరావు, కార్యదర్శులుగా దొడ్డా మధుబాబు, సూరేపల్లి కృష్ణమూర్తిని నియమించడం జరిగిందని మండల అధ్యక్షులు బోయ నాగిరెడ్డి తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

నేడు శివపార్వతుల శాంతి కల్యాణోత్సవం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన భ్రమరాంబ సమేత నాగేశ్వర స్వామి దేవస్థాన తిరుణాళ్ల వేడుకలను సోమవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు గణపతి పూజ, 8 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివార్లకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 గంటలకు శివపార్వతుల వార్షిక శాంతి కల్యాణ మహోత్సవంను భక్తులు పీటలపై కూర్చుని నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వేడుకలలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో రాత్రి 4 భారి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల దీవెనలు పొందాలని ఆయన కోరారు.



స్వామివారి మూలవిరాట్

డైమండ్ జూబ్లీ నిర్వహించాలి

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రామకృష్ణా ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలను పాఠశాల ప్రతిష్ట పెంచేలా నిర్వహించాలని పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. పాఠశాలలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ తొలి సన్నాహక సమావేశం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ, ఎన్నో ప్రత్యేకతలు కలిగిన సంస్కృత పాఠశాల ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఏకం కావాలన్నారు. సమావేశంలో విద్యావేత్త డీఏఆర్ సుబ్రమణ్యం, జూలకంటి సీతారామాంజనేయులు, గట్టా శ్రీను, కోపూరి శ్రీనుబాబు, వి.వి. అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

వ్యక్తికి తీవ్రగాయాలు

అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని తాడువాయికి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పుట్లగూడెం గ్రామానికి చెందిన పల్లెలపాటి గురునాథం బైకుపై తాడువాయి వెళుతుండగా ఎదురుగా వచ్చే లారీ ఢీ కొట్టింది. గురునాథం కుడి కాలుకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి 108 అత్యవసర వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీ వేగంగా రావడాన్ని బాధితుడు గుర్తించకపోవడం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు భావిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గురజాల : మండలంలోని అంబాపురం గ్రామంలో ఆదివారం కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజా తరుపున టీడీపీ నాయకుడు బత్తుల మల్లారెడ్డి ప్రచారం చేశారు. గ్రామంలోని పట్టభద్రుల ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.